క్లుప్తంగా

జూన్ 13న ఒమ్మలి మోదకొండమ్మ పండగ



మోదకొండమ్మ

మాడుగుల: ఒమ్మలిలో మోదకొండమ్మ పండగ జూన్ 13న నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నామన్నారు. అదే నెల 5న అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు కొలువు ఏర్పాటు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో నమామి సాయి శతరుద్రీయం

కె.కోటపాడు: కింతాడ శివారు కూండ్రపువాని పాలెంలోని రామసత్యసాయి మందిరంలో ఆదివారం నమామి సాయి శతరుద్రీయం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఉదయం నుంచి శోభాయాత్ర, గోమాత పూజ, ప్రశాంతి పతాకావిష్కరణ, జ్యోతి ప్రకాసనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల వేద అధ్యయన విభాగం సమన్వయకర్త కొతారు సాయి శ్రీహరి ప్రసాదశర్మ, జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు, కశిరెడ్డి అప్పలనాయుడు, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

కడగెడ్డలో తాగునీటి కోసం ఆందోళన

రావికమతం: చీమలపాడు పంచాయతీ శివారు కడగెడ్డ గ్రామంలో తాగునీటి ఇక్కట్లు నెలకొన్నాయి. గ్రామంలో 120 మంది గిరిజనులకు చేతిబోరు ఉన్నప్పటికీ వేసవి దృష్ట్యా నీరు ఇంకిపోయి బురద వస్తోంది. దీంతో లోతైన గెడ్డకు వెళ్లి చెలమ నీటిని తెచ్చుకుని తాగాల్సి వస్తోందని టెంక లక్ష్మి, పొట్నూరి బాలమ్మ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ తాగునీటి సమస్యపై కలెక్టరుకు ఫిర్యాదు చేసినా నేటికీ పరిష్కారం చూపలేదని వాపోయారు.


చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న యువకులు

దేవరాపల్లి: సీతారామ సేవా వారధి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముషిడిపల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక యూత్ సభ్యులు ఆదివారం ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని యూత్ సభ్యులు తెలిపారు.

రూఫ్‌గార్డెన్‌తో ఇంటికి, శరీరానికి మేలు



సదస్సులో మాట్లాడుతున్న జయచంద్ర

అనకాపల్లిటౌన్ : రూఫ్‌గార్డెన్‌తో ఇంటికి, శరీరానికి మేలు చేకూరుతుందని బయోటెక్నాలజీ శాస్త్రవేత్త కె.జయచంద్ర అన్నారు. పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో గ్రీన్ క్లబ్, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రూఫ్ గార్డెనింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రత ప్రభావాలను తగ్గించడంలో రూఫ్‌గార్డెన్ సాగు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇలాంటివి నగరాల్లో నివాసాలకు చలువపందిళ్లు అని, పచ్చని ఆవాసం–ప్రకృతితో సావాసమని పేర్కొన్నారు. రూఫ్‌గార్డెనింగ్‌లో మెలకువలను వివరించారు. క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, జిల్లాకు చెందిన రూఫ్‌గార్డెన్ సంఘ సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి: కుమ్మరాపల్లిలో దుర్గాలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేల వేషాలు, కోలాటాలు, తప్పెటగుళ్ల వంటి కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వేసవిలో మంచి ఆదాయం

- కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి
- ఉచిత విద్యుత్తు, రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం



చోద్యంలో వంగ సాగు



లింగంపేటలో బీర సాగు

గొలుగొండ: ఒకప్పుడు ఖరీఫ్ వరి కోతల తర్వాత పొలాలను బీడుగా వదిలేసిన రైతులు కాలానుగుణంగా వస్తున్న మార్పులతో కూరగాయల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్తు సరఫరాతోపాటు రాయితీలు ఇవ్వడంతో ఏటా వేసవిలో మండలంలో 800 ఎకరాలకుపైగా వీటిని పండిస్తున్నారు. మార్కెట్లో ధరలు నిలకడగా ఉండటంతో లాభాలు ఆర్జిస్తున్నారు.

800 ఎకరాల్లో కూరగాయల సాగు

మండలంలో చోద్యం, లింగంపేట, అమ్మపేట, గొలుగొండ, ఏఎల్‌పురం, కొత్త మల్లంపేట, ఏటిగైరంపేట తదితర గ్రామాల్లో 800 ఎకరాలకుపైగా కూరగాయలు సాగవుతోంది. వంగ, బెండ, బీర, కాకర, టమాటా సాగుపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

వ్యవసాయ మోటార్లతో సాగు..

చోద్యం, లింగంపేట, కొత్తమల్లంపేట, ఏటిగైరంపేట తదితర ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు అధికంగా ఉన్నాయి. వీటి ద్వారా సాగు చేయడం వల్ల రైతులకు సాగునీటి కష్టాలు పెద్దగా లేవు. పైగా ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ఆర్థిక భారం తగ్గడంతో సాగు లాభదాయకంగా ఉంటుందని చెబుతున్నారు.

అనుకూలంగా మార్కెట్లు

రైతులు పండించిన కూరగాయల అమ్మకాలకు అనుకూలంగా మార్కెట్లు ఉన్నాయి. ఏఎల్‌పురం, తుని, నర్సీపట్నం మార్కెట్లకు పంటను తరలించి రైతులు అమ్మకాలు చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి వాటిని కొనుగోలు చేస్తున్నారు.

నిలకడగా ధరలు

వేసవి కావడంతో బెండ, వంగ, బీర, టమాటా ధరలు బాగున్నాయని రైతులు చెబుతున్నారు. బెండ, బీర, టమాటా సాగుకు ఎకరానికి రూ.20 వేల వరకు ఖర్చు కాగా, రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. పందిరి విధానంలో బీర సాగు చేయడం వల్ల దిగుబడులు బాగుంటున్నాయి. 20 కేజీల కేట్ బీరకాయలు రూ.350 ఉండగా, ఇప్పుడు రూ.700, గతంలో టమాటా రూ.150 ఉండగా, ప్రస్తుతం రూ.400 వరకు అమ్ముడుపోతున్నాయి.

పందిరి సాగుకు రాయితీలు



పందిరి సాగుకు 50 శాతం రాయితీ ఇస్తున్నాం. దీని వల్ల బీర, టమాటా, కాకర, ఆగాకర పంటలు వేస్తున్న రైతులకు ప్రోత్సాహం అందుతోంది. పంటల దిగుబడులు పెరిగి నాణ్యత బాగుంటుంది. రైతులకు ప్రతీ గ్రామంలో పందిరి సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

– సుదర్శన, ఉద్యానవన శాఖ అధికారి, గొలుగొండ

లాభాలు వస్తున్నాయి



వేసవిలో కూరగాయల సాగు వల్ల మంచి లాభాలు వస్తున్నాయి. నీటి సౌకర్యం ఉండటం వల్ల ఏటా ఈ సీజన్‌లో కూరగాయల సాగు చేస్తున్నాం. మార్కెట్ దగ్గరలో ఉండటం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతున్నాయి

– సుర్ల చినబాబులు, రైతు, జోగుంపేట

పుస్తక పఠనంతో విజ్ఞానం



లెమన్ స్పూన్ పోటీల్లో విద్యార్థులు

నర్సీపట్నం: విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవటంపై ఆసక్తి పెంపొందించుకోవాలని గ్రంథపాలకురాలు పి.దమయంతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుస్తకాలు చదవటం ద్వారా అపారమైన జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులకు టీచర్ హేమలత కూచిపూడి నృత్యం నేర్పించారు. బి.నర్సింహమూర్తి మాతృభాష గొప్పతనం గురించి వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు ఆటలపై అవగాహన కల్పించారు.

లెమన్ స్పూన్ పోటీలు

కె.కోటపాడు: చదువులతోపాటు క్రీడలకు విద్యార్థులు ప్రాధాన్యమివ్వాలని గ్రంథపాలకురాలు సౌమ్య తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. వీటితో పాటు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాన్ని విద్యార్థులకు గ్రంథాలయాధికారిణి సౌమ్య వివరించారు. క్రీడాపోటీల్లో విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున బహుమతులను అందించనున్నట్లు ఆమె తెలిపారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

ఇన్‌చార్జి తహసీల్దార్ త్రివేణి



రోలుగుంట: ప్రభుత్వం చేపట్టిన భూసర్వేతో రైతుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ హెచ్.త్రివేణి తెలిపారు. ఇప్పటి వరకూ భూసర్వే కార్యక్రమం ఏ ప్రభుత్వం చేపట్టలేదన్నారు. భూముల క్రయ విక్రయాలతో యజమానులు మారుతున్నారు. వీటికి కచ్చితమైన సరిహద్దులు లేక వివాదాలు నెలకొంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటి పరిష్కారంపై దృష్టి సారించి రైతుకు పైసా ఖర్చు కాకుండా సర్వేయర్లతో భూ అంచనాతోపాటు, సరిహద్దు, రైతుల వివరాలను నమోదు చేస్తుందన్నార. దీనికి ముందు కచ్చిత పద్ధతిలో డ్రోన్ సర్వే చేస్తున్నామన్నారు. సర్వే పూర్తయిన భూముల వద్ద రైతులను రప్పించి సరిహద్దు రాళ్లను ప్రభుత్వమే వేస్తుందన్నారు. మండలంలో తొలి విడతగా రీసర్వే పూర్తయిన ఆరు రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. సర్వే చేయనున్న గ్రామాల్లో రైతులకు వీఆర్‌ఏల ద్వారా ముందుగా సమాచారం ఇస్తున్నామని, తమ సిబ్బందికి పూర్తిస్థాయి సహకరించాలని వివరించారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి సన్నిధిలో ఎంపీ సత్యవతి దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : మండలంలో జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు నరసింగరావుపేట మోదకొండమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు అమ్మవారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిల్, వైఎస్సార్‌సీపీ నేతలు ఎ.అప్పారావు, కరణం సురేష్, రమణ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మైక్‌సెట్‌కు రూ.70 వేలు వితరణ



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న నరసింహారెడ్డి, లావణ్య దంపతులు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయానికి మైక్‌సెట్ నిమిత్తం కడపజిల్లా రాజంపేట గ్రామానికి చెందిన మెట్టా నరసింహారెడ్డి, లావణ్య దంపతులు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆదివారం రూ.70 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు మద్దాల కూర్మారావు, ముత్తా ఈశ్వరరావు, ముత్తా శ్రీనివాసరావు, వాకాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



జోగుంపేటలో పూర్వ విద్యార్థులు

గొలుగొండ: జోగుంపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1997–98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వీరంతా ఆదివారం ఇక్కడ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో పరవశించిపోయారు. ఆనాటి జ్ఞాపకాలతో పాటు కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకుని మురిసిపోయారు. అప్పటి గురువులకు ఘన సన్మానం చేశారు. హైస్కూల్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు.

తల్లి మొదటి గురువు



విద్యార్థులకు హనుమాన్ జననం, తల్లి ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న వక్తలు

పాయకరావుపేట : పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం హనుమాను జన్మదినం సందర్భంగా సుందరకాండను చదివి వినిపించారు. అదే విధంగా మదర్స్ డే సందర్భంగా తల్లి ప్రాముఖ్యతపై, తల్లి మొదటి గురువు అని విద్యార్థులకు హితబోధ చేశారు. తల్లిని అందరూ గౌరవించి, పూజించాలని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ 106వ కంటి వైద్య శిబిరం

- 425 మందికి ఉచిత కంటి పరీక్షలు
- 10 మంది రక్తదానం



కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : బ్రాండిక్స్ అపారెల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత 106వ కంటి వైద్య శిబిరంలో 425 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రెడ్ క్రాస్ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరంలో బ్రాండిక్స్ సిబ్బంది తమ సేవల్ని అందించారు. 296 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 95 మందికి మందులు అందజేయగా, 55 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. పక్కన నిర్వహించిన రక్తదాన శిబిరంలో 10 మంది రక్తదానాన్ని చేశారు. రెండు శిబిరాలకు విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయాన్ని బ్రాండిక్స్ సంస్థ కల్పించింది. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు.

శ్రీరామదూతం శిరసా నమామి

పల్లెలు కాషాయమయం అయ్యాయి. వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా అంజనీ పుత్రుని ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబై.. పూజలందుకున్నాయి. పలుచోట్ల స్వామివారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వీరు పెద్ద ఎత్తున శోభాయాత్రలు చేపట్టిన రహదారులన్నీ హనుమాన్‌నామస్మరణతో మార్మోగాయి.

- వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



కొత్తకోటలో భక్తులకు అన్నదానం చేస్తున్న విప్ ధర్మశ్రీ



దేవరాపల్లి: కొల్లివానిపాలెంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీపీ



మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు



నాతవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



మాడుగుల రూరల్ : కె.జె.పురంలో వీరాంజనేయస్వామికి భక్తుల పూజలు



రోలుగుంటలో స్వామివారికి పూజలు చేసుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు కొల్లివానిపాలెంలో హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి, చల్లా నాయుడు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కొల్లివానిపాలెం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. పెదనందిపల్లి కాలనీలో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

భక్తి కార్యక్రమాలతో జాతీయ సమైక్యత: ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం: హనుమజ్జయంతి సందర్భంగా కొత్తకోట, రావికమతం తదితర గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. కొత్తకోటలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని భక్తులకు వడ్డనలు చేశారు. భక్తి కార్యక్రమాలు జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో పలు గ్రామాల మీదుగా భజరంగభళీ ర్యాలీ నిర్వహించారు. వందలాదిగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో బుచ్చెయ్యపేట, వడ్డాది, విజయరామరాజుపేట, రాజాం, సీతయ్యపేట, మంగళాపురం, గున్నెంపూడి, పెదమదీన, సీతయ్యపేట, కొమళ్లపూడి, బంగారుమెట్ట, తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు, రాత్రికి భజనలు, భక్తి గీతాలాపనలు చేశారు.

మాడుగుల/మాడుగుల రూరల్: పట్టణంలో నిర్వాహకుడు రాజీ శ్రీను ఆధ్వర్యంలో భక్తులు 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా తమలపాకు పూజ చేశారు. సాయంత్రం కోలాటాలతోపాటు శ్రీరామాంజనేయ యుద్ధం సన్నివేశం ప్రదర్శించారు. ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు పాల్గొన్నారు. కె.జె.పురం వీరాంజనేయస్వామి ఆలయంలో తమలపాకు పూజ, ప్రత్యేక అభిషేకాలు చేశారు. వీరవిల్లి అగ్రహారంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నాతవరం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. రాజుపేట అగ్రహారం ఆలయంలో పి.కె.గూడెం పీఏసీఎస్ డైరెక్టరు గుడపర్తి అచ్చియ్యనాయుడు, పి.కె.గూడెం ఆలయంలో రెడ్డి అప్పలనాయుడు, ఎం.బెన్నవరంలో కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, డి.యర్రవరంలో పారుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వెన్నలపాలెం, చెర్లోపాలెం శృంగవరం, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు.

కె.కోటపాడు: చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా చౌడువాడ, పాచిలవానిపాలెం, కింతాడ, సూర్రెడ్డిపాలెం, వి.సంతపాలెం, ఎ.భీమవరం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాచిలవానిపాలెంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ ప్రారంభించారు.

రోలుగుంట: హనుమాన్ జయంతి సందర్భంగా రోలుగుంట ఆలయానికి ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. కొమరవోలులో స్వామివారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు పాపంపేట, రొంగలిపాలెం తదితర గ్రామాల్లో నిర్వహించారు.

గొలుగొండ: మండలంలోని జోగుంపేట, ఏఎల్‌పురం, కొత్త ఎల్లవరం, గొలుగొండ తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కొత్త ఎల్లవరంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు కొబ్బరి మొక్కలు నాటారు

మాకవరపాలెం: మండలంలోని తామరం, కొండలఅగ్రహారం, లచ్చన్నపాలెం, జంగాలపల్లి, పెద్దిపాలెం, రామన్నపాలెం, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వైభవంగా నిర్వహించారు. ఆలయాల వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.



గొలుగొండ: కొబ్బరి మొక్క నాటుతున్న జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు



కె.కోటపాడు : పాచిలవానిపాలెంలో పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ



మాడుగులలో వీరాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వడగాడ్పులపై అప్రమత్తత అవసరం

కోటవురట్ల : రానున్న 5 రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు ప్రతి కుటుంబాన్ని కలుసుకుని వడగాడ్పులు, ఉక్కపోత పై అప్రమత్తత కల్పించాలన్నారు. అంతేకాకుండా కార్యదర్శులు అన్ని గ్రామాల్లో టముకు ద్వారా ప్రజలకు సమాచారం అందించాలన్నారు.

బయట తిరిగేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు కాటన్ దుస్తులు ధరించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.